నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 7: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయ్‌ఆనంద్, రవిపుడ్, త్రిషు మెటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి 12.30 వరకు సర్వీసింగ్ గల్లీ ఏరియా, కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియా, రవిపుడ్ గల్లీ, పహేల్ ఫుడ్ ఫీడర్‌లో 2:30 నుంచి 5:50 వరకు, అక్షయ్ ఫుడ్ ఫీడర్‌లో 2:30 నుంచి 5:30 వరకు, ఆర్‌ఈసీ ఫీడర్ పరిధిలో 2:30 నుంచి 3 గంటల వరకు ఆరాంఘర్, ఏకేఆర్ పెట్రోల్ బంక్, మహాలక్ష్మి హోటల్ తదితర ప్రాంతాల్లో కోతలు ఉంటాయన్నారు. మరమ్మతుల కారణంగా ఈ కోతలు విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అసంఘటిత రంగ కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్ నగర్ , జూన్7: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
సమాన పనికి సమాన వేతనాలు కార్మికులకు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.



మణికొండ మున్సిపాలిటీలో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆరిఫ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

మణికొండ, జూన్ 7 : బక్రీద్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మణికొండ నార్సింగ్ మున్సిపాలిటీలలో ముస్లిం సోదరులు ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేసి శాంతి సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పేలా అల్లాను ప్రసాదించాలని ముస్లిం సోదరులు ప్రార్థన చేసినట్లు తెలిపారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ మసీదులో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు పండ్లు ఇతర సామగ్రి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మహమ్మద్ రియాజుద్దీన్ పటేల్, మహమ్మద్ మునఫ్, మహమ్మద్ అక్బర్, సాధిక్, సయ్యద్ ఫాజిల్, బాషా, ఫజ్లూర్, రహమాన్, ముజాహిద్, ముజాహిద్, ఆజాజ్, ముతివార్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక ప్రార్థనలు

మైలార్‌దేవ్‌పల్లి: త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మసీదుల్లో, ఈద్గాల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్సై చైతన్యరెడ్డిల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

శంషాబాద్ పట్టణంలో..

శంషాబాద్ రూరల్: బక్రీద్ పండుగా వేడుకలు శంషాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పట్టణంలోని ఈద్గాలో ముస్లింలు భారీగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లీమ్‌లు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ వేడుకలు జరుపుకుంటామని తెలిపారు. ప్రతి ముస్లిం తనకు తోచిన విధంగా ఇతరులకు సాయం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ముస్లీమ్ పెద్దలు ఇష్తీకార్ శరీష్, మాజీ కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్, తాజ్‌బాబా,మసూద్‌అలీఖాన్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనలు..

జూబ్లీహిల్స్: బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, విధేయతకు.. సోదర భావానికి నిదర్శనంగా నిలుస్తుందని ప్రముఖ ఇస్లాం బోధకులు నక్ష బందీ పేర్కొన్నారు. శనివారం రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ క్రీడా మైదానంలో స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఈద్గాలో సామూహిక ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నమాజు చదివించారు. ఈ ప్రార్థనలలో రహ్మత్ నగర్, శ్రీరామ్‌నగర్, కార్మికనగర్, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లిం లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

సులేమాన్ నగర్ డివిజన్‌లో..

వ్యవసాయ యూనివర్సిటీ: బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు రాజేంద్రనగర్ డివిజన్లోని సులేమాన్ నగర్ డివిజన్లోని ముస్లిం సోదరులు ఘనంగా పండుగ సంబరాలు జరుపుకున్నారు. పెద్దలు సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఎండీ జహీరొద్దీన్ , ఎండీ నజీర్, ఎండీ బాబా , రెహమాన్ తదితరులు పాల్గొని ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ సందర్భంగా ముస్లింల ప్రార్థనలు

శంషాబాద్ పట్టణంలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



బక్రీద్‌ను పురస్కరించుకొని ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వైభవంగా శ్రీవారికి చక్రస్నానం... ముగిసిన బ్రహ్మోత్సవాలు

కలియుగ దైవం వేంకటేశ్వరుడి 20వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. హిమాయత్ నగర్ లోని లిబర్టీ వద్ద గల తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవంతో పాటు మహా పూర్ణాహుతి, చక్రస్నానం వైభవంగా జరిగింది. పుష్కరిణిలో స్నానం చేయించి మంత్రోచ్ఛరణలు, భజనతో పాటు ధ్వజారోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాల ముగింపు జరిగింది. సకల దోషాలను తొలగించడానికి పరిపూర్ణుడైన పరమాత్ముడిని ప్రార్థించి భక్తులందరిపై ఆశీస్సులు ఉండాలని పలువురు స్వామివారిని కోరుకున్నారు. ఈ ముగింపు కార్యక్ర మంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, యంపి అనిల్ కుమార్, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీటీడీ ఉపకార్యనిర్వహణ అధికారి రమేష్, దాత వైటీవీ త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.– హిమాయత్ నగర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే
'ది సిటిజన్ కౌన్సిల్'

ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి తదితరులు

మణికొండ, జూన్ 7 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ది సిటిజన్ కౌన్సిల్' నిరంతరం పాటుపడుతుందని మణికొండ మున్సిపాలిటీ ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్‌హిల్స్ కాలనీలోని కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ది సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కొంతమంది తమ కౌన్సిల్ పేరును తప్పుగా సూచించే కుట్ర చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల్లో ది సిటిజన్ కౌన్సిల్‌కు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక కొంతమంది వ్యక్తులు ది సిటిజన్ కౌన్సిల్ పేరును ప్రజల్లో తప్పు భావనను తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. తమ కౌన్సిల్ సభ్యులు ఎక్కడ ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు లేదని, కొన్ని సమాచార మాధ్యమాల్లో పైవేటు వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారాలలో తమ కౌన్సిల్ సభ్యులు జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతో సేవ, సంకల్పాన్ని పెట్టుకొని ది సిటిజన్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు ఉన్నా ది సిటిజన్ కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వారికి న్యాయం జరిగేలా తమవంతుగా చేయూత సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్ కౌన్సిల్ ప్రతినిధులు అందె లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న అగస్టిన్

ఖైరతాబాద్, జూన్ 7 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ అన్నారు. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ షిజు ఆగస్టిన్‌తో కలిసి మాట్లాడారు. గ్రామాల్లో విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ ద్వారా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణ, ఏపీలో సుమారు 50 పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, మహిళా సాధికారిత కోసం ఇంటర్ ఆపై చదువులు పూర్తి చేసిన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని ఉపాధ్యాయులుగా నియమిస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు www. allindiaprivateschools.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మంత్రివర్గ సమావేశాల్లో
పెన్షనర్ల ఊసేలేదు

ఖైరతాబాద్, జూన్ 7 : రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల్లో పెన్షనర్ల ఊసే ఎత్తడం లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. రాజేంద్రబాబు, ఎంవీ నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి బి. నర్సయ్యలు శనివారంఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మొక్కుబడిగా డీఏను ప్రకటించడం సరికాదని, ఇటీవల ఉప ముఖ్య మంత్రి విడుదల చేసిన ప్రకటనలో కూడా పీఆర్సీ గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ కేర్ విధానంలోనూ స్పష్టత లేదని, అందరికీ నెలకు రూ.500 వసూలు చేయడం కంటె పెన్షనర్ల పెన్షన్ ఆధారంగా రూ.150, రూ.300, రూ. 500గా మూడు గ్రూపులుగా విభజించాలన్నారు. అదే మొత్తాన్ని ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో జమ చేయాలని కోరారు.

ఉచితంగా విద్య..యూనిఫామ్స్

మణికొండలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తదితరులు

అత్తాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

- **ఉచితంగా మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్స్ అందజేత**
- **ఈ ఏడాది నుంచి నోట్‌బుక్స్‌లు పంపిణీ**
- **బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు**

మణికొండ, జూన్ 7 : మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బడి-బాట కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు నిరంజన్ అధ్యక్షతన ఏర్పాటు చేసి 2025-26 విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా కృషి చేయాలన్నారు. అదే విధంగా అదనంగా నూతన తరగతి గదుల నిర్మాణం పూర్తి అయ్యాయి. దీంతో తరగతి గదులు అందుబాటులోకి రావడంతో నూతనంగా అడ్మిషన్లు పొందే విద్యార్థుల సంఖ్య ను పెంచే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయులు నిరంజన్ కోరారు. 12న బడి ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందచేస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమం లో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కొండకల్లా రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుర్రోళ్లు శ్రీరాములు, నాయకులు శ్రవణ్ కుమార్, గంగాధర్, శివగంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మైలార్‌దేవ్‌పల్లి: చిన్ననాటి నుంచే ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పిస్తే విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. అత్తాపూర్‌లోని పలు ప్రాంతాల్లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో సమావేశమై పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వాణిసాయిప్రసాద్‌రావు, ఉపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జూబ్లీహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని యూసుఫ్ గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ ఎంబీ. నరసింహ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాలలో క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, సన్న బియ్యం తో మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు నాగరాజు, మాలతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్ ఎం నరసింహ, ఉపాధ్యాయులు

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి హెచ్ ఎం నరసింహ

పర్యావరణ పరిరక్షణను
ప్రోత్సహించే దిశగా..

మాదాపూర్, జూన్ 7: ఆరోగ్య సంరక్షణ రంగంలో స్థిరమైన సంరక్షణ పద్ధతులు, పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే లక్ష్యం తో ముందుకు సాగుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మ భూషణ్, ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ మాజీహెడ్, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ లో యశోద దవాఖానల యాజమాన్యం సహకారంతో పర్యావరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ ఆరోగ్యాన్ని సమర్థిస్తూ పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడంలో యశోద దవాఖాన యాజమాన్యం ముం దుంటుందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ దిలీప్ బానుశాలి ఆసుపత్రి పరిశ్రమ (వైద్య రంగం) ద్వారా పర్యావరణ రక్షణ యొక్క అవసరం ఆవశ్యకతను వివరించారు. యశోద ఆసుపత్రి లీడ్ హాస్పిటల్ సౌత్‌జోన్ రెండు వద్ద మెడికల్ సర్వీసెస్ డాక్టర్ లింగయ్య పర్యావరణ కార్యక్రమాలు, సహాయం, వ్యవస్థల అత్యవసర అవసరాన్ని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దవాఖానలు, నర్సింగ్ హోమ్స్ నుంచి ఆహ్వానితులు, హరిత కార్యక్రమాలను అభ్యసిస్తున్న దవాఖానలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ సహాయక సేవలు ఉత్పత్తులు ప్రదర్శించారు. కార్యక్రమంలో నిపుణుల చర్చలు, భాగస్వామ్య సెషన్లు, గ్రీన్‌హెల్త్ కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

ఆకట్టుకున్న కూచిపూడి, భరతనాట్యం

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరి , శ్రీముఖి నృత్యాలయ నాట్యగురువు మనస్విని కోసూరు శిష్యబృందం కూచిపూడి అంశాలను మనస్విని, అంజనా, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హరిణి, దివ్య శ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్విక, విజయ శ్రీ, పూర్వీక, మాన్విత, హరిహర ప్రదర్శించారు.

రేషన్ బియ్యానికి ఇన్ని తిప్పలా..!

మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ లబ్ధిదారులను ముప్పు తిప్పలు పెడుతున్నది. ఏ రేషన్ దుకాణం ఎదుట చూసినా..జనాలు బారులు తీరుతున్నారు. పనులు మానుకొని రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వస్తున్నది. పేకేపేట మండల పరిధిలో శనివారం ఓ రేషన్ దుకాణం వద్ద రేషన్ లబ్ధిదారులు ఇలా బారులు తీరారు.

బహిరంగ ప్రకటన

తేది: 07-06-2025

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా సమాచారమివ్వునది ఏమనగా నా క్లయింట్లు దిగువ షెడ్యూల్ నందు వివరించబడిన ఆస్తి కొనుగోలుకు సంబంధించి సదరు ఆస్తి యజమానితో ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఆస్తి వివరాలు మరియు యజమాని పేరు షెడ్యూల్ నందు వివరించబడినవి. నా క్లయింట్లు పాక్షిక అమ్మక ప్రతిఫలం కూడా చెల్లించారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి షెడ్యూలు నందు వివరించబడిన ఆస్తి నందు ఏదైనా హక్కు, వాటా, టైటిల్, క్లెయిమ్, స్వాధీనత లేదా ఏ రకమైన ఆసక్తిని కలిగి ఉన్నచో వారు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి **ఏడు (7) రోజులలోగా** సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించగలరు. **ఏడు (7) రోజులలోగా** ఏ విధమైన క్లెయిమ్స్ రానిపక్షంలో ఏ వ్యక్తికి సదరు షెడ్యూలు ఆస్తినందు ఏ విధమైన హక్కు లేదా క్లెయిమ్ లేదని భావించబడుతుంది మరియు నా క్లయింట్లు మొత్తం అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించుట ద్వారా అవసరమైన డాక్యుమెంట్లు అనగా సేల్ డీడ్స్/AGPA మొ।। రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు. ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ విధమైన క్లెయిమ్స్ అంగీకరించబడవు.

షెడ్యూల్

ఆస్తి వివరణ	యజమానుల పేరు
రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ వద్దగల బాదం అపార్ట్‌మెంట్స్‌లో 925.55 చ.గజాలలో దామాషా UDS భూమితో, ఒక కార్ పార్కింగ్, 900 చ.అడుగుల విస్తీర్ణపు ప్లింత్ ఏరియా, PTIN నెం. 1100616428తో మున్సిపల్ డోర్ 6-3-905/A/103 కలిగిన, మొదటి అంతస్తులో ఫ్లాట్ నెం. 3 (103)	**1) వీరేంద్ర నారాయణ్ అస్తన (మరణించారు) & 2) మాధురి అస్తన (మరణించారు),** ప్రాతినిధ్యం వహించు వారి న్యాయవారసులు: **1. అర్చన సక్సేనా,** భర్త: ప్రణేష్ రాజ్ సక్సేనా, తండ్రి: వీరేంద్ర నారాయణ్ అస్తన, నివాసం: ఇం.నెం. 5-8-517/B4F4, జగదీష్ మార్కెట్, పూనం అపార్ట్‌మెంట్స్, అబిడ్స్, నాంపల్లి, హైదరాబాద్. **2. రాజీవ్ అస్తన,** తండ్రి: వీరేంద్ర నారాయణ్ అస్తన, నివాసం: ఇం.నెం. 6-3-905/A, బాదం అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 103, జాఫర్ అలీ బాగ్, సోమాజిగూడ, హైదరాబాద్. **3. రాజేష్ అస్తన,** తండ్రి: వీరేంద్ర నారాయణ్ అస్తన, నివాసం: ఇం.నెం. B-695 S/F, PKT 11, DDA జంత ఫ్లాట్ జసోల విహార్, జాకిర్ నగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, సౌత్ ఢిల్లీ, ఢిల్లీ.

సం/- **(V. మనోహర్ రావు), అడ్వకేట్**
ఫ్లాట్ నెం. 399, రోడ్ నెం. 81, ఫేజ్-3, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033, **ఫోన్: 9849016333.**